
సాక్షి ఒడిశా

బుధవారం । 28 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ.3,93,495

బంగారం : 100 మిల్లీ గ్రాములు

వెండి : 1 గ్రాము 300 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ

ఒడిశా భూభాగం ఆక్రమణలకు గురవుతోంది



గజపతి జిల్లాలోని రాయఘడ బ్లాక్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఒడిశా భూభాగాన్ని ఆక్రమించుకుంటోందని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆరోపించారు.

- 8లో▸



వినతుల వెల్లువ

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భారీగా వినతులు అధికారులు స్వీకరించారు.

- 8లో▸

న్యూస్‌రీల్

గోడకూలి మహిళ మృతి



గోడ కూలిన దృశ్యం

భువనేశ్వర్: భద్రక్ జిల్లాలో గోడ కూలి మహిళ మృతి చెందింది. బాసుదేవ్‌పూర్ మున్సిపాలిటీ 3వ వార్డు మందారీ ప్రాంతంలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. ఎడతెరిపి లేని వర్షం కారణంగా గోడ కూలిపోవడంతో ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మహిళ బిష్ణుప్రియ మహంతిగా గుర్తించారు. స్థానిక తహసీల్దార్, మున్సిపల్ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కలప దుంగలు స్వాధీనం



కలప దుంగలతో పట్టుబడిన విజయ్‌కుమార్

రాయగడ: అక్రమంగా తరలిస్తున్న కలప దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పార్వతీపురం మన్యం జిల్లాలోని ఉదయపూర్ గ్రామానికి చెందిన బి.విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. గుణుపూర్ అటవీ శాఖ రేంజర్ గంగాధర్ మిశ్రో తెలిపిన వివరాల మేరకు.. గుణుపూర్ సమితిలోని జగన్నాథపురం నుంచి కలప దుంగలు అక్రమంగా రవాణా జరుగుతున్న సమాచారం మేరకు అటవీ శాఖ సిబ్బంది గొటాలాపాదారా వద్ద తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక పికప్ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా అందులో విలువైన 29 కలప దుంగలు పట్టుబడ్డాయి. స్వాధీనం చేసుకున్న కలప దుంగల విలువ సుమారు రూ.లక్షకు పైబడి ఉంటుందని అంచనా వేశారు.

బాలికపై లైంగిక దాడి?



పట్టుబడిన నిందితుడు

భువనేశ్వర్: పూరీలో నిత్యం రద్దీగా ఉండే బొడొదండా మార్గంలో సోమవారం పశ్చిమ బెంగాల్‌కు చెందిన మైనర్ బాలికపై ఒక యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. నిందితుడు భువనేశ్వర్‌కు చెందిన రంజిత్ సమంతరాయ్‌గా గుర్తించారు. తప్పించుకుని పారిపోతున్న నిందితుని స్థానికులు, ఒక హోంగార్డు పట్టుకున్నారు. నిందితుడిని స్థానిక సింహద్వారం పోలీసు ఠాణాకు తీసుకెళ్లే లోగా చావగొట్టారు. ఘటనపై నగర డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నాడు.

గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒక యువకుడిని అబ్కారీ శాఖ, రైల్వేశాఖ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తి జిల్లాలోని టికిరి గ్రామానికి చెందిన పంకజ్ మాఝిగా గుర్తించారు. గంజాయి అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు అబ్కారీ శాఖ అధికారులకు అందిన సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం స్థానిక రైల్వేస్టేషన్‌లోని 5వ నంబర్ ప్లాట్‌ఫారంలో తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా కనిపించే పంకజ్ బ్యాగులను తనిఖీ చేయగా అందులో 16.200 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు నిందితుడిని కోర్టుకు తరలించారు. రాయగడ నుంచి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయిపూర్‌కు గంజాయిని తరలించేందుకు నిందితుడు ప్లాట్‌ఫారంలో ఉండగా అబ్కారీ శాఖ ఐఐసీ బిజయ్ కుమార్ బెక్, ఎస్ఐ ఎ.నాయక్, ఏఎస్ఐ మానిక్ చంద్ర గౌడో, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ప్రమోద్ కుమార్ బొలా, రమేష్ కందపాని, డాగ్ స్క్వాడ్ బీకే సింగ్ తదితరులు దాడులు నిర్వహించారు.

బలపడుతున్న అల్పపీడనం



- రాష్ట్రానికి వర్ష సూచన
- పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్

భువనేశ్వర్: రాష్ట్ర తీరప్రాంతంలో అల్పపీడన ప్రాంతం ఏర్పడింది. దీని ప్రభావంతో వర్షం తాకిడి అధికమయ్యే అవకాశాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) కార్యాలయం అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. వాయువ్య బంగాళాఖాతం మరియు దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రసరణ ప్రభావంతో రాష్ట్ర తీరానికి సమీపంలో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం తెలిపింది. రానున్న 48 గంటల్లో తుపాను వాతావరణంపై స్పష్టత వస్తుందని పేర్కొంది. రాష్ట్రంలో జూన్ 1వ తేదీ వరకు నాలుగు రోజులు వర్షాలు పడే అవకాశం ఉంది. రాష్ట్రంలో 15 జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. కొన్నిచోట్ల గంటకు 40 నుండి 50 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. మరోవైపు రాష్ట్రంలో రుతు



పవనాలకు ముందు వర్షం కొనసాగుతోంది.

ఎల్లో అలెర్ట్

కొరాపుట్, మల్కన్‌గిరి, నవరంగ్‌పూర్, రాయగడ, గజపతి, కలహండి, కందమల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అన్ని జిల్లాల కలెక్టర్లు ఆకస్మిక విపత్తుని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి అనుబంధ యంత్రాంగంతో సన్నద్ధం కావాలని సూచించారు. పిడుగుపాటు విపత్తుపై సాధారణ ప్రజానీకానికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు వాతావరణంపై నిఘా ఉంచేలా చైతన్యపరచాల్సి ఉందన్నారు. ఉరుములు, మెరుపుల నుంచి రక్షణ పొందడానికి ప్రజలు సురక్షితమైన ఆశ్రయం పొందాలని కోరారు.

చేపల వేటపై అప్రమత్తం

సముద్రంలో చేపల వేటపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలి. వాతావరణ తాజా మార్పులకు అనుగుణంగా మత్స్యకారులు అనుక్షణం మెలకువతో వ్యవహరించాలని తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని ఎస్ఆర్‌సీ పేర్కొంది. గాలివానలు, వడగండ్ల వాన, పిడుగులు, వర్షపాతం కారణంగా సంభవించిన నష్టంపై తక్షణమే క్షేత్రస్థాయి నివేదిక దాఖలు చేయాలని అధికారులకు సూచించింది.

జర్నలిస్టుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వర్కింగ్ జర్నలిస్టులు

పర్లాకిమిడి: ఒడిశా రాష్ట్రంలోని బలంఘీర్ జిల్లా పుయితోలా పీఎస్ పరిధి కులోత్రా పట్టణంలో 'బోడోఖబర్' ఒడియా దినపత్రిక పాత్రికేయుడు బిజయ ప్రధాన్‌ను కాళ్లు, చేతులు కట్టివేసి అమానుషంగా కొట్టిన ఘటనపై యావత్ ఒడిశా రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ గేటు వద్ద ఉత్కళ జర్నలిస్టుల సంఘం సభ్యులు నిరసన తెలిపారు. అనంతరం అదనపు జిల్లా మేజిస్ట్రేట్ ఫాల్గుణ మఝిని కలిసి సీఎం పేరిట రాసిన వినతిని అందజేశారు. పాత్రికేయుడిని కొట్టినవారిని వెంటనే అరెస్టు చేయాలని, ఒడిశాలో జర్నలిస్టుల సురక్షా చట్టం



ఏడీఎం మఝికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉత్కళ జర్నలిస్టుల సంఘం గజపతి జిల్లా అధ్యక్షుడు బిధాన్ చౌదరి, కార్యదర్శి ప్రదీప్ నాయక్, ద్విజేంద్రనాథ్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

బీజేడీకి షాక్

- పార్టీకి సుభాష్ రౌత్ రాజీనామా



మాట్లాడుతున్న సుభాష్ రౌత్

కొరాపుట్: జయపూర్‌లో బీజేడీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుభాష్ రౌత్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. మంగళవారం జయపూర్ పట్టణంలోని రాజానగర్‌లో ఉన్న తన ఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటన చేశారు. తన వ్యాపార అవకాశాలు మరింత మెరుగు చేసుకోవడానికి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఏ పార్టీలో చేరేది ఇప్పట్లో నిర్ణయం చేయలేనన్నారు. అధికార పార్టీ ద్వారా ప్రజలకు సేవలు చేయగలమన్నారు. ప్రస్తుత పరిస్థితిలో తాను బీజేడీని వదులుకుంటున్నానని తెలియజేశారు. ఈయన గత సార్వత్రిక ఎన్నికల్లో జయపూర్ అసెంబ్లీ స్థానంలో బీజేడీ టిక్కెట్ ఆశించి భంగపడ్డారు.

పింఛన్ అందజేయరూ..?



దరఖాస్తులతో వృద్ధులు, మహిళలు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితిలో గిరిజన మహిళలకు వృద్ధాప్య పింఛన్ అందడం లేదు. దీంతో మంగళవారం సమితి కార్యాలయానికి వచ్చిన వృద్ధులు తమకు పింఛన్ మంజూరు చేయాలని విన్నవించారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నామని వాపోయారు. దాదాపు 13 ఏళ్ల క్రితం భర్తను కోల్పోయిన మహిళలకు కూడా పింఛన్ అందడం లేదని తెలిపారు. ఇప్పటికైనా పింఛన్ అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

త్వరితగతిన సైబర్ నేరాల దర్యాప్తు

- డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా



వర్కుషాపు కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది



కార్యక్రమానికి హాజరైన డీజీపీ యోగేష్ బహదూర్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు

భువనేశ్వర్: తక్కువ సమయంలో సైబర్ నేరాలను సక్రమంగా దర్యాప్తు చేయడంలో సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచనున్నట్లు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ యోగేష్ బహదూర్ ఖురానియా తెలిపారు. స్థానిక సైబర్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ సహకారంతో 'సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ మరియు సైబర్ ఇంటెలిజెన్స్'పై మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సైబర్ నేరాలను నివారించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. అధికారులకు ఈ వర్క్‌షాప్ ఎంతో సహాయపడుతుందని పేర్కొన్నారు. సైబర్ నిపుణుడు డాక్టర్ రక్షిత్ టాండన్ వివిధ జిల్లాల అధికారులకు శిక్షణ అందించారు. కార్యక్రమానికి క్రైమ్ బ్రాంచ్ డీజీపీ వినయ్‌తోష్ మిశ్రా, ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ సార్థక్ షడంగి, డీఐజీ (ఎస్‌టీఎఫ్) పినాక్ మిశ్రా తదితరులు హాజరయ్యారు.

మావోయిస్టు లొంగుబాటు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి, పక్కనే లొంగిపోయిన మావోయిస్టు అజయ్



అజయ్ నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

రాయగడ: మావోయిస్టు కార్యకలాపాల్లో క్రియాశీల పాత్ర పోషించిన బిజయ్ పునేం అలియాస్ అజయ్ జిల్లా ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సమక్షంలో లొంగిపోయారు. అతని వద్ద నుంచి 9 ఎంఎం పిస్తోలు, 8 రౌండ్ల తుపాకీ గుండ్లు, వాకీటాకీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ స్వాతి విలేకరుల సమావేశంలో వివరాలను మంగళవారం వెల్లడించారు. అజయ్ సీపీఐ(మావోయిస్టు) గ్రూప్‌లో 2009లో చేరారు. ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న అజయ్ మావోయిస్టు నేత మోడేం బాలకృష్ణ అలియాస్ మనోజ్ వద్ద సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తుండేవాడు. అనంతరం 2014లో ఏసీఎం ర్యాంక్‌గా పదోన్నతి సాధించి మనోజ్ గన్‌మ్యాన్‌గా పనిచేశారు. 2023వ సంవత్సరంలో బీజీఎన్ డివిజన్ మావోయిస్టు దళంలో చేరారు. 2009లో ఛత్తీస్‌గఢ్, 2011-2014లో మల్కన్‌గిరిలోని కొరాపుట్ ప్రాంతం, 2014-2024 వరకు నువాపడ, కలహండి, బౌధ్, మల్కన్‌గిరి కొరాపుట్ తదితర ప్రాంతాల్లో మావోయిస్టుల కార్యకలాపాల్లో క్రియాశీలకంగా ఉండేవాడు. రాష్ట్ర ప్రభుత్వం అతడిపై రూ.4 లక్షల రివార్డును కూడా ప్రకటించింది.

జన జీవన స్రవంతిలో కలిసేందుకే...

మావోయిస్టుల కార్యకలాపాల్లో పాల్గొని నానా అవస్థలు పడ్డానని లొంగిపోయిన అజయ్ విలేకరుల సమక్షంలో చెప్పారు. సరైన ఆహారం లభించకపోవడంతో పాటు కార్యకాలపాల్లో భాగంగా సుదూర ప్రాంతాల్లో పనిచేయాల్సి వచ్చిందన్నారు. భాషాపరమైన సమస్య తలెత్తడం వంటి ఇబ్బందులకు గురై మావోయిస్టుగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసి జీవితాన్ని సుఖంగా గడిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించారు. కాగా లొంగిపోయిన మావోయిస్టు అజయ్‌కు రీహాబిలిటేషన్ కార్యక్రమంలో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని ఎస్పీ తెలియజేశారు. అందరూ జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని పిలుపునిచ్చారు.

సాయమందిస్తే.. సత్తా చాటుతా

- ఉన్నత చదువుల కోసం విద్యార్థిని అభ్యర్థన



విద్యార్థిని పద్మిణీ ఖొర

జయపురం: తాను ఉన్నత విద్యనభ్యసించేందుకు దాతలు సాయం చేయాలని కొరాపుట్ జిల్లాలోని లక్ష్మీపూర్‌కు చెందిన పద్మిణీ ఖొర అభ్యర్థిస్తోంది. విద్యార్థిని +2 పరీక్షల్లో 94.4 శాతం మార్కులు సాధించింది. పై చదువులు చదివేందుకు ఆమె కుంటుబానికి ఆర్థిక స్తోమత లేదు. తాను డిగ్రీ పూర్తిచేసి సివిల్ సర్వీస్‌కు వెళ్లాలని భావిస్తోందని పేర్కొంటోంది. విద్యార్థిని తండ్రికి మూడేళ్ల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో, తల్లి కష్టపడుతూ అతికష్టం మీద కుంటుబాన్ని పోషిస్తోంది. ఇంట్లో ముగ్గురు ఆడ పిల్లలు ఉండగా కేవలం పద్మిణీ ఖిలో మాత్రమే చదువుతోంది. దాతలు స్పందించి తనకు సాయమందిస్తే.. సత్తా చాటగలనని పేర్కొంది.

యాదవ మహాసభ నిర్వహణకు సన్నాహాలు



మహాసభ పోస్టర్ విడుదల చేస్తున్న యాదవ పెద్దలు

జయపురం: స్థానిక యాదవ భవనంలో కొరాపుట్ జిల్లా యాదవ మహాసభ నిర్వహణకు సన్నాహక సమావేశాన్ని యాదవ మహాసభ అధ్యక్షుడు మదన మోహన నాయిక్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. మహాసభను ఘనంగా జరపాలని సమావేశంలో తీర్మానించారు. జూన్ 2వ తేదీన రెజాంగల్ నుంచి కలశ యాత్ర కొరాపుట్ జిల్లాకు వస్తుందని, కలశ యాత్రకు ఘనంగా స్వాగతం పలకాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్కళ యాదవ మహాసభ సాధారణ కార్యదర్శి సాధీరాం నాయిక్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని వెల్లడించారు. రెజాంగల్ నుంచి వచ్చే కలశ యాత్రకు బొరిగుమ్మ, బొయిపరిగుడలో స్వాగతం పలికే బాధ్యతలను జిల్లా సాధారణ కార్యదర్శి రాజేంద్ర గౌడకు అప్పగించారు. రాష్ట్రంలో ఉన్న యాదవ సామాజిక ప్రజలకు ఆదివాసీ గుర్తింపునివ్వాలని, అలాగే గోచర భూముల్లో ఆక్రమణలను తొలగించాలని, జాతులవారీగా జనసంఖ్య జాబితాను విడుదల చేయాలని, విద్య, ఉద్యోగ స్థానాల్లో యాదవ సాంప్రదాయ వర్గానికి సముచిత రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఓం ఫెడ్ నిర్వహణ పూర్తి బాధ్యతలను యాదవులకే అప్పగించాలని కోరారు. సమావేశంలో కవిరాజ్ పరమేశ్వర పాత్రో, నారాయణ గౌఢ, ప్రదీప్ నాయిక్, నరేంద్ర నాయిక్, రాబినారాయణ గౌఢ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి



విద్యార్థులతో గవర్నర్ దంపతులు

- గవర్నర్ హరిబాబు కంభంపాటి

భువనేశ్వర్: హెచ్ఎస్‌సీ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలు సాధించాలని గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి ఆకాంక్షించారు. స్థానిక రాజ్ భవన్ న్యూ అభిషేక్ హాల్‌లో 2025 వార్షిక హైస్కూల్ సర్టిఫికెట్ (హెచ్ఎస్‌సీ) పరీక్షలో సత్తాచాటిన 25 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో ప్రథమ మహిళ గవర్నర్ సతీమణి జయశ్రీ కంభంపాటి సైతం పాల్గొన్నారు. విద్యార్థులు వినయంతో నేర్చుకొని ధైర్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవులు పట్టివేత



కంటైనర్‌లో ఆవులు

కొరాపుట్: కంటైనర్లలో భారీగా ఆవులను తరలిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం కొరాపుట్ జిల్లా బొరిగుమ్మ నుంచి నాలుగు కంటైనర్లలో సుమారు 200 ఆవులు అక్రమ రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో కొరాపుట్ జిల్లా కేంద్ర పోలీసులు రాణీఘడ్ వద్ద ఈ కంటైనర్లని అడ్డగించి సోదాలను జరిపారు. అందులో దయనీయ స్థితిలో ఆవులు కనిపించాయి. వాటిలో నాలుగు ఆవులు ఎండ వేడిమికి మృతి చెందాయి. వెంటనే పోలీసులు ఆ కంటైనర్లని సీజ్ చేశారు. సమాచారం తెలియడంతో హిందూ పరివార్ సంస్థల సభ్యులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ ఆవులను జయపూర్ సమీపంలోని గొడపాదర్‌లో ఉన్న గోశాలకి తరలించారు. ఆవులను ఆంధ్రప్రదేశ్‌లోని మానాపురం తరలిస్తున్నట్లు నిందితులు పేర్కొన్నారు. అవి అక్కడి నుంచి కేరళ వెళ్తాయని పోలీసులు ధ్రువీకరించారు. ఈ ఘటనలో నలుగురు కంటైనర్ డ్రైవర్లని పోలీసులు అరెస్ట్ చేశారు.

అధ్వానంగా రహదారి



మజ్జిగౌరి మందిరానికి వెళ్లే మట్టిరోడ్డు ఇదే...

రాయగడ: స్థానిక మజ్జిగౌరి మందిరానికి రైల్వే బ్రిడ్జి కింద నుంచి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. దీంతో మందిరం కమిటీ సభ్యులు మందిరం తరపున మందిరం నుంచి రైల్వేస్టేషన్‌కు ఉచితంగా సేవలు అందిస్తున్న బస్‌ను నిలిపివేశారు. సోమవారం రాత్రి కురిసిన వర్షాలకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రహదారి మొత్తం గుంతలమయమయ్యింది. అయితే ప్రతీ ఆది, మంగళ, బుధవారాల్లో పొరుగు రాష్ట్రమైన ఆంధ్ర నుంచి వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. దీనిలో అత్యధిక శాతం మంది సొంత వాహనాలు, మరికొందరు అద్దెకు తీసుకొచ్చే వాహనాల్లో ఇక్కడికి వస్తుంటారు. మందిరానికి వచ్చే ప్రధాన రహదారి ఇదే కావడంతో వాహనాలు లోపలకు వచ్చే సమయంలో ఇక్కడ ఎప్పుడు ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకుంటాయోననే భయాందోళనల మధ్య వాహనాలు నడుపుతున్నారు. కాగా గత కొద్దిరోజులుగా ఉన్న మట్టిరోడ్డు పూర్తిగా పాడవ్వడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వాహనాల పార్కింగ్ కోసం భారీ మొత్తంలో వసూళ్లు చేస్తున్నప్పటికీ అందుకు అనుగుణంగా పార్కింగ్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సమీపంలోని మూడో రైల్వేలైన్, అదేవిధంగా జంఝావతి నది వద్ద కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ రహదారి మరీ అధ్వానంగా మారింది. భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండడంతో రహదారి పూర్తిగా పాడైంది. అందువలన ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకముందే రహదారి మరమ్మతులు చేయాలని భక్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఫిషింగ్ జెట్టీ కోసం స్థల పరిశీలన



బందరువానిపేటలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

గార: బందరువానిపేట, తోనంగి పరిసరాల్లో ఫిషింగ్ జెట్టీ ఏర్పాటుకు గల అవకాశాలపై అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. తోనంగి రెవెన్యూ పరిధిలో పోర్టుల్యాండ్ భూములుండగా, వీటిలో ఫిషింగ్ జెట్టీ అవకాశాలపై గోవా షిప్పింగ్ లిమిటెడ్ డీజీఎం, కమాండెంట్ ఎం.హరికృష్ణన్, పోర్టు ల్యాండ్ కన్జర్వేటర్ బీఎస్ మూర్తిలు పరిశీలించారు. సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, ఆర్ఐ డి.రాజేంద్ర, వీఆర్వో సుశీల తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్‌బుక్‌లోకి శామ్యూల్



ధ్రువపత్రం అందుకుంటున్న శామ్యూల్

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ రామమందిరం వీధికి చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు విక్టర్ శామ్యూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ తరఫున పాస్టర్ ఆగస్టిన్ దండింగి ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబర్ ఒకటో తేదీన 18 దేశాలకు చెందిన 1090 మంది ఒకేసారి ఆన్‌లైన్ వేదికగా గంట వ్యవధిలో కీబోర్డ్ ప్లే చేసి ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిని గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు గుర్తించి 1046 మందికి బుక్‌లో స్థానం కల్పించారు. అందులో శామ్యూల్ ఒకరు. ఇటీవల విజయవాడలోని గుణదలలో జరిగిన కార్యక్రమంలో శామ్యూల్‌కు ధ్రువీకరణపత్రం ప్రదానం చేశారు.

ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం రూ.81.84 లక్షలు



ఆదిత్యుని కానుకల లెక్కింపు చేపడుతున్న స్వచ్ఛంద సమితి ప్రతినిధులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ కానుకల ద్వారా రూ.81,84,890 ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అనివెట్టి మండపంలో నిర్వహించిన లెక్కింపు ప్రక్రియలో నగదు రూపంలో రూ.77,21,606, చిల్లర రూపంలో రూ.4,63,284 వరకు ఆదాయం లభించిందని వివరించారు. అలాగే 81 గ్రాముల 27 మిల్లీ గ్రాముల బంగారం, 3 కిలోల 810 గ్రాముల వెండి వస్తువులు కూడా మొక్కులు, కానుకల రూపంలో హుండీల్లో లభించినట్లుగా తెలియజేశారు. వీటితో పాటు విదేశీ నగదు కూడా లభించింది. లెక్కింపునకు పర్యవేక్షకునిగా జిల్లా ఏసీ ప్రసాద్‌పట్నాయక్, ఆలయ ప్రధా నార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు. శ్రీహరిసేవా సమితి, శ్రీసత్య సాయి సేవా సమితి శ్రీవారి సేవా సమితి ప్రతినిధులు ఈ లెక్కింపులో స్వచ్ఛందంగా పాల్గొని నగదును చిల్లరను లెక్కించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కవిటి : మండలంలోని కొజ్జిరియా జంక్షన్‌లో 16వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు కవిటి ఎస్ఐ వి.రవివర్మ మంగళవారం తెలిపారు. సీహెచ్ బలరాంపురం వైపు నుంచి జాతీయ రహదారిపై నడిచివస్తుండగా ట్రాలీ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. తెలుగు షర్టు, నలుపు ప్యాంటు ధరించిన ఈ వ్యక్తి వివరాలు తెలిసిన వారు 6309990870 నంబరుకు సంప్రదించాలని కోరారు.

అదుపు తప్పిన ఆటో

- ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని గూనపాలెం డీఎస్పీ కార్యాలయం సమీపంలో సెంటర్ డివైడర్ స్తంభాన్ని ఆటో ఢీకొట్టింది. ఆ సమయంలో వెనుకగా వస్తున్న ద్విచక్రవాహనాలు అదే ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గార మండల కేంద్రానికి చెందిన లక్ష్మణరావు తన ఆటోలో కళింగపట్నానికి చెందిన దీర్ఘాసి రత్న, కృష్ణవేణి, దీర్ఘాసి నరసమ్మ, శాలిహుండంకు చెందిన తోట రాజులమ్మ, మరో ఇద్దరు వ్యక్తులతో కలిసి కళింగపట్నం నుంచి పాతబస్టాండ్‌కు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఆటోడ్రైవర్ లక్ష్మణరావు తలకు గాయమవ్వగా, రాజులమ్మ చేతికి గాయమైంది. ఈ ఘటనలో రూ.5 వేలు నగదున్న పర్సు, సెల్‌ఫోన్ పోయిందని రాజులమ్మ తెలిపారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, ద్విచక్ర వాహనదారులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని ట్రాఫిక్ సీఐ నాగరాజు పేర్కొన్నారు.

వినతుల వెల్లువ



రాయగడ: సమస్యలు వింటున్న కలెక్టర్ పట్వారీ, పక్కనే సహోట తదితరులు



మల్కన్‌గిరి: కలెక్టర్‌కు వినతులు అందజేస్తున్న గిరిజనులు



మల్కన్‌గిరి: తమ సమస్యలు చెప్పేందుకు లైన్‌లో గిరిజనులు



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలోని రాయఘడ బ్లాక్ కోయిపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం గ్రామ ముఖి పరిపాలన, స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ బిజయ కుమార్ దాస్, ఎస్పీ జ్యోతింద్రకుమర్ పండా, జిల్లా పరిషత్ సీడీఎం శంకర్ కెరకెటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా తదితరులు ప్రజల నుంచి మొత్తం 52 వినతులు స్వీకరించారు. వాటిలో గ్రామ సమస్యలు 16, వ్యక్తిగతం 36 ఉన్నాయి. వీటన్నిటినీ త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ దాస్ స్వయం సహాయక గ్రూపుల స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో రాయఘడ సమితి చైర్మన్ పూర్ణబాసి నాయక్, ఉపాధ్యక్షుడు జ్యోతి ప్రసాద్ పాణి, బీడీవో సంతోష్‌కుమార్ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని పోడియా సమితి కార్యాలయంలో కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్ స్పందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పరిసర పంచాయతీల నుంచి వచ్చిన 36 వినతులు స్వీకరించారు. ప్రతీ సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ వినోద్ కుమార్ పటేల్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ సభరో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి కలెక్టర్ ఫరూల్ పట్వారీ, ఏఎస్పీ బిష్ణుప్రసాద్ పాత్రో, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోట, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (గుణుపూర్) అజయ్ కుమార్ ప్రధాన్, సీడీఎంవో ప్రఫుల్ల కుమార్ పాడి తదితరులు హాజరయ్యారు. సమితిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 44 మంది సమస్యలను స్వీకరించారు. వినతుల స్వీకరణలో భాగంగా ఇద్దరికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేల చొప్పున్న ఆర్థిక సాయం అందజేశారు.

హెచ్‌ఎం పదోన్నతులకు సర్టిఫికెట్ల పరిశీలన



ప్రధానోపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న తనిఖీ బృందం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూల్స్‌లో ఖాళీ (మొత్తం 83)గా ఉన్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల పదోన్నతలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ మొదలైంది. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా సీనియారిటీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులకు 1:2 రేషియోలో మొదటిరోజు 166 మంది సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేశారు. డీఈఓ సదాశివుని తిరుమల చైతన్య నేతృత్వంలో డిప్యూటీ డీఈఓలు ఆర్.విజయకుమారి, పి.విలియమ్స్ ఆధ్వర్యంలో సీనియర్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, డీఈఓ కార్యాలయ సిబ్బందితో కూడిన స్రూటినీ కమిటీలు ఉద్యోగ పదోన్నతి పొందనున్న స్కూల్ అసిస్టెంట్ల అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను, సర్వీస్ రికార్డులను క్షున్నంగా పరిశీలించారు. కొన్ని రిమార్కులను గుర్తించారు. కాగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌తోపాటు స్కూల్ 3142 బదిలీల స్కూల్ అసిస్టెంట్లు పోస్టులు, 2550 సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సెలింగ్ పోస్టుల వెరిఫికేషన్ సైతం పూర్తి చేయడం గమనార్హం. బుధవారం మిగిలిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల తనిఖీతోపాటు బదిలీలకు సంబంధించి 131 ఎస్‌జీటీల పోస్టుల వెరిఫికేషన్ పూర్తి చేయనున్నట్టు డీఈఓ తెలిపారు.

ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి..

గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతుల్లో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరుతూ బహుజన టీచర్స్ అసోసియేషన్‌తో కలిపి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘ జిల్లాశాఖ ప్రతినిధులు డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమకు 15 శాతం హక్కుగా రావాల్సిన 12 పోస్టులను ఎస్సీ,ఎస్టీలకు మాత్రమే కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం బోనెల రమేష్, వడమ శరత్, దార్భాశి గణేష్, పడాల ప్రతాప్‌కుమార్, షన్ముఖ రావు, కృష్ణమోహన్ తదితరులు డీఈఓకు వినతి పత్రం అందజేశారు.

సప్లిమెంటరీ ప్రాక్టికల్స్‌కు సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీల్లో ప్రాక్టికల్స్‌కు రంగం సిద్ధమైంది. మార్చిలో ఫెయిలైన/గైర్హాజరైన విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు జరగనున్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కేంద్రంగా ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. షెడ్యూల్లో భాగంగా ఈ నెల 28న ఫిజిక్స్, 29న కెమిస్ట్రీ, 30న బోటనీ, 31న జువాలజీ సబ్జెక్టుల్లో ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ప్రతిరోజు రెండు సెషన్స్‌లలో ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జనరల్, ఒకేషనల్ పరీక్షలు జరుగుతాయి. ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు సైతం ఇవే తేదీల్లో జరగనున్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ బాలురు, శ్రీకాకుళం ప్రభుత్వ బాలికలు, నరసన్నపేట, కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కళాశాలల కేంద్రాలుగా రెండు సెషన్లలో జరగనున్నాయని ఇంటర్ బోర్డు జిల్లా అధికారులు వెల్లడించారు.

'ఆ రెండు' తప్పనిసరి..

ఈ ఏడాది 2025 ఫిబ్రవరి నెలాఖరులో జరిగిన మానవతా విలువలు, పర్యావరణ విద్య పరీక్షల్లో ఫెయిలైన/ గైర్హాజరైన విద్యార్థులకు సైతం పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు ఏర్పాట్లు చేసింది. ఈ రెండు పరీక్షల్లో విద్యార్థులు తప్పనిసరిగా హాజరై ఉత్తీర్ణులైతేనే పాస్ సర్టిఫికెట్ వస్తుందన్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జూన్ 4న నైతికత, మానవతా విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్), జూన్ 6న పర్యావరణ విద్య (ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్) పరీక్ష జూన్ 6న జరగనుంది.

సద్వినియోగం చేసుకోవాలి..

ఇప్పటికే ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలు జరిగి, స్పాట్ వాల్యుయేషన్ కూడా ముగింపుకొచ్చింది. సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 28 నుంచి జరుగుతాయి. రెండు సెషన్స్‌లో నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం, ఎంపిక చేసిన కేంద్రాల్లో మాత్రమే జరుగుతాయి.

– ప్రగడ దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ శ్రీకాకుళం

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్స్ డీన్ ఉదయ్‌భాస్కర్ మంగళవారం విడుదల చేశారు. విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు సంబంధించి 19 పీజీ కోర్సుల్లో 574 మంది పరీక్షలు రాయగా 411 మంది ఉత్తీర్ణత సాధించారు. 163 మంది ఫెయిలయ్యారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్‌లో 42 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు.

నాట్య నీరాజనం

- 15 వేలకుపైగా ప్రదర్శనలు
- అభినయ నృత్య నికేతన్ ద్వారా కూచిపూడి శిక్షణ ఇస్తున్న తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యం
- 600కుపైగా అవార్డులు, సత్కారాలు
- విదేశాల్లోనూ ప్రదర్శనలు



నీరజ నృత్య భంగిమ

గిన్నిస్ రికార్డులు, ప్రశంసలు

- 2010లో హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో సిలికానాంధ్ర ఏర్పాటు చేసి కూచిపూడి మహా బృంద నాట్యంలో పాల్గొని గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు.
- 2012లో హైదరాబాద్‌లో సిలికానాంధ్రలో మళ్లీ ఆరు వేల మందితో నిర్వహించిన కూచిపూడి ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ రికార్డులో చోటు సాధించారు.
- 2014, 2015లో కూడా రెండు సార్లు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం పొందారు.
- 2013లో ఆదిలీలా ఫౌండేషన్ వారి ఉగాది పురస్కారం, ఢిల్లీ ఏపీ భవన్‌లో కూచిపూడి నాట్య నీరాజనాలతో పాటుగా నేటికి 15వేలు ప్రదర్శనలు, 38 అవార్డులు, 600పైగా సత్కారాలు అందుకున్నారు.

శ్రీకాకుళం కల్చరల్: కూచిపూడిలో విశేషమైన సేవలు అందిస్తున్నారు శ్రీకాకుళంలోని నక్కవీధికి చెందిన తిమ్మరాజు నీరజా సుబ్రహ్మణ్యం. పట్టణంలోని నివాసముంటున్న శేషగిరిరావు, సుశీలాదేవిల కుమార్తె నీరజ తన 8వ ఏట నుంచి నుంచి నాట్యంపై మక్కువతో భరతనాట్యంలో డిప్లమో, అనంతరం కూచిపూడిలో సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేశారు. భరతనాట్యం రామ్మూర్తి, పుణ్యవతి వద్ద నేర్చుకుని, కూచిపూడిని విశాఖలోని కళాక్షేత్రంలో బాల వద్ద అభ్యసించారు. ప్రస్తుతం ఈమె టీపీఎం హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఈమె భర్త సుబ్రహ్మణ్యం మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, ఆమెను కూడా నాట్యవిద్యలో తీర్చిదిద్దుతున్నారు.

15 వేలకు పైగా ప్రదర్శనలు

3వ తరగతిలోనే ఆమె తన మొదటి ప్రదర్శన ఇచ్చారు. తాను ప్రదర్శనలు ఇస్తూనే శిష్యులను తయారు చేసి వారితో కూడా ప్రదర్శనలు ఇస్తున్నారు. తాను కళాశాలలో చదువుతున్న సమయంలోనే 1994లో అభియన నృత్య నికేతన్ పేరుతో ఒక నాట్య పాఠశాలను ఏర్పాటు చేశారు. తన వద్ద నాట్య విద్యను అభ్యసిస్తున్న వారిలో 42 మందికి విజయనగరం కళాశాల ద్వారా డిప్లమా పూర్తి చేయించారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం కోసం రూపొందించిన పలు టెలిఫిల్మ్‌లకు దర్శకత్వం వహించారు. హిందీలో 7, 8, 10 తరగతులకు నృత్యరూపంలో డీవీడీలు చేశారు. ఆడేపాడే తోలుబొమ్మ, శ్రీరాఘవేంద్ర స్వామి మహత్యం(కన్నడ), మావూరి మంకినమ్మ చలన చిత్రాలకు కొరియోగ్రఫీ చేశారు. ఏటా వెయ్యి మందికి నృత్య శిక్షణలు ఇస్తున్నారు.



విశాఖలో ధ్యాన అన్నమయ్య ట్రస్టు ఉగాది పురస్కారం అందుకుంటున్న నీరజ

ఉచిత శిక్షణలు

శ్రీకాకుళంలోని టంగుటూరి ప్రకాశం మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులకు, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు, మున్సిపల్, ప్రభుత్వ స్కూళ్లలో చదివిన పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఏ టా చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్‌లో వేసవి శిక్షణ ఉచితంగా అందిస్తున్నారు. జిల్లాలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలకు ప్రతినిధిగా ఉంటూ స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ప్రదర్శనల నిర్వహణ బాధ్యతలు చేస్తున్నారు. మలేషియా, నేపాల్, థాయిలాండ్, బెనారస్ వంటి దేశాల్లో ప్రదర్శనలిచ్చారు.

ఒడిశా భూభాగం ఆక్రమణలకు గురవుతోంది



సమావేశంలో పాల్గొన్న ఇతర జిల్లాల ఎమ్మెల్యేలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపేష్

- పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని రాయఘడ బ్లాక్ గంగాబడ పంచాయతీ మాణికపట్న, కళింగదళ్ గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ ఒడిశా భూభాగాన్ని ఆక్రమించుకుంటోందని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి ఆరోపించారు. మంగళవారం భువనేశ్వర్‌లోని సచివాలయంలో జరిగిన హౌస్ కమిటీ రీషెడ్యూల్ సమావేశంలో సరిహద్దు సమస్యలపై కొటియా (కొరాపుట్), గజపతి జిల్లా సరిహద్దు జిల్లాల ఎమ్మెల్యేలతో చర్చించారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒడిశా ప్రజలను తమవైపు తిప్పుకోవాలని చూస్తోందని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పర్లాకిమిడి 6వ వార్డు సేరి జగ్గిలి వీధిలో పొరుగున ఉన్న పాతపట్నం మండలం పెద్ద గోపాలపురానికి వెళ్లే డ్రైనేజీని బ్లాక్ చేయడం వల్ల మూడేళ్ల క్రితం స్కూల్‌కు వెళ్లే విద్యార్థి పడిపోయి మృత్యువాడపడ్డాడని గుర్తు చేశారు. అందువలన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఎస్‌బీఐ శాఖ ఏర్పాటుకు వినతి



మంత్రి సూర్యవంశీకి సమస్య వివరిస్తున్న బీజేపీ నాయకులు

రాయగడ: జిల్లాలోని కొలనార సమితి పరిధి ముకుందపూర్‌లో ఎస్‌బీఐ శాఖను ఏర్పాటు చేయాలని స్థానిక బీజేపీ నాయకులు మానస్ కుమార్ దాస్, సంతోష్ మహాపాత్రోలు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్‌కు మంగళవారం వినతిపత్రంను అందజేశారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ముకుందపూర్‌లో ఎస్‌బీఐ శాఖ లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ముకుందపూర్‌కు సమీపంలో సుమారు 9 పంచాయతీలకు చెందిన ప్రజలు ఉన్నారని, అందువలన శాఖ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

ముంబై దంపతులకు శిశువు దత్తత



బిడ్డను దత్తతగా స్వీకరిస్తున్న దంపతులు

పర్లాకిమిడి: మహారాష్ట్రకు చెందిన దంపతులకు రాణిపేటలో ఉన్న స్వతంత్ర పొష్య సంతాన స్వీకార కేంద్రంలోని శిశువును కలెక్టర్ బిజయ కుమార్ దాస్ దత్తతగా మంగళవారం అందజేశారు. మూడు నెలల క్రితం పర్లాకిమిడి రైల్వేస్టేషన్‌లో ఎవరో వదిలి వెళ్లిన శిశువును ఈ కేంద్రానికి జిల్లా శిశు సురక్ష, సంక్షేమ శాఖ అధికారులు తరలించి సంరక్షించారు. మూడేళ్ల క్రితం కేంద్ర సంతాన దత్తత కేంద్రం పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న ముంబైకి చెందిన ఈ దంపతులకు బిడ్డను చూపించగా వారు ఇష్టం ప్రకారం దత్తతగా స్వీకరించేందుకు అంగీకరించారు. కార్యక్రమంలో ఏడీఎం ఫాల్గుణి మరియు, శిశు సంక్షేమ అధ్యక్షుడు అశ్వినీ కుమార్ మహాపాత్రో, డీసీపీయూ అరుణ్ కుమార్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

జలమయం



జిల్లాలో మంగళవారం సాయంత్రం పలుచోట్ల భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. శ్రీకాకుళం నగరంలో ప్రధానకూడళ్లు జలమయమయ్యాయి. డేఅండ్‌నైట్ జంక్షన్, సరస్వతీ మహల్ తదితర ప్రాంతాల్లో షాపుల్లోకి నీరు చేరడంతో ఇబ్బందులు తప్పలేదు.

– శ్రీకాకుళం పీఎన్ కాలనీ

దళిత కుటుంబం ఉసురు తీసిన ప్రేమ

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దళిత కుటుంబంలో తండ్రి మృతి
- తల్లీ, సోదరి పరిస్థితి విషమం
- విచారణ పేరుతో విజయవాడ పోలీసులు టార్చర్ పెట్టారని ఎచ్చెర్ల పోలీసులకు లేఖ



యండా మోహనరావు(ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రం సమీపంలో గార మండలం వత్సవలస వద్ద ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఓ దళిత కుటుంబం ఈ నెల 22న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భర్త యండా మోహనరావు (47) రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటాక మృతిచెందాడు. భార్య రేణుక, కుమార్తె అంజలిలు రిమ్స్ ఐసీయూలో ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నా వారి పరిస్థితి విషమంగానే ఉంది. తమ లాంటి దళిత పేద కుటుంబం మొత్తం ఇలా ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం వెనక తమ కుమారుడు విజయవాడకు చెందిన ఓ మైనరు బాలికను ప్రేమించి పరారవ్వడం, బాలిక తరపువాళ్లు విజయవాడ పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, ఉపాధి నిమిత్తం శ్రీకాకుళం నగరం గుజరాతీపేట సాయిబాబా గుడి సమీపంలో అద్దె ఇంట్లో నివాసముంటున్న తమ వద్దకు పెనమలూరు పోలీసులు శ్రీనివాసరావు, వీరయ్యలు వచ్చి తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు పాల్పడటమే కారణమని, అంతే కాకుండా పోలీసులు విజయవాడ తీసుకెళ్లి నానా ఇబ్బందులకు గురిచేసేవారని.. పరారైన కుమారుని జాడ కూడా లేకపోవడంతో ఇలా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డామంటూ బాధితులు లేఖ రాయడం సంచలనంగా మారింది. ఇవన్నీ మోహనరావు సుమారు 15 నుంచి 18 పేపర్లలో ఎచ్చెర్ల పోలీసులకు రాసిన లేఖలో ఉన్నవే కాక.. భార్య రేణుక మంగళవారం రిమ్స్ ఆసుపత్రి వద్ద విలేకరుల వద్ద తన గోడు వినిపించింది. తమ ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేసి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు అకౌంట్లు, బైక్ తీసుకెళ్లిపోయారని, మతిస్థిమితం లేని తన కుమార్తెను, తనను ఇకనైనా విడిచిపెట్టాలని వేడుకుంది. యువకున్ని పిలిపిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరు వర్గాలతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిగించాలనుకున్నామని.. ఈలోగానే ఇలా జరగడం బాధాకరమని ధర్మవరం సర్పంచ్ అల్లు కన్నబాబు, గ్రామస్తులు మీడియాకు చెప్పారు.

థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదు:సీఐ

ఈ విషయమై పెనమలూరు సీఐ వెంకటరమణ 'సాక్షి'తో మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేశామన్నారు. ఈ వ్యవహారమంతా యువకుడి తల్లికి తెలిసినా భర్త మోహనరావుకు చెప్పలేదన్నారు. అబ్బాయి, అమ్మాయిని తెచ్చిస్తే ఎటువంటి కేసు ఉండదని చెప్పామని, లేకుంటే ముద్దాయిలవుతారని చెప్పడంతో భయంతో వారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడివుంటారని పేర్కొన్నారు. పోలీసులు ఎటువంటి థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని, బాలిక అదృశ్యం కేసు సున్నితాంశం ఇలా చేయాల్సివచ్చిందని స్పష్టం చేశారు.

కేసు నమోదు

గార: వత్సవలస సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ధర్మవరం గ్రామానికి చెందిన ఎండ మోహనరావు(47) రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడని, భార్య రేణుక ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

క్లుప్తంగా

పైడితల్లికి మామిడి పండ్ల నివేదన



మామిడి పండ్ల నివేదన, పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడి తల్లి అమ్మవారికి మంగళవారం మామిడిపండ్లతో నివేదన చేశారు. అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్ లు శాస్త్రోక్తంగా నిత్య పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్చార్జ్ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు



గాయపడిన వారిని 108లో రాజాం తరలిస్తున్న దృశ్యం

వంగర: మండల పరిధిలోని అరసాడ శ్రీసంతోషిమాత ఆలయం ఆవరణలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మంగళవారం ఎదురెదురుగా వెళ్తున్న ఆ ఇద్దరు వ్యక్తుల బైక్‌లు ఢీకొనడంతో బూరాడకు చెందిన శంకరరావుకు తలకు గాయాలు కాగా, పోరాంకు చెందిన కుడి కాలికి గాయాలయ్యాయి. 108కు స్థానికులు సమాచారం అందించడంతో ఈఎంటీ విశ్వనాథ్, పైలట్ సాయిబాబా క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

లారీ ఇంజిన్‌లో మంటలు



లారీ ఇంజిన్‌లో నుంచి వ్యాపించిన మంటలతో కూడుకున్న పొగ

పార్వతీపురం రూరల్: విశాఖ నుంచి ఒడిశాలోని రాయగడ ప్రాంతానికి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ ట్రాఫిక్ కూడలి వద్ద మంగళవారం ఉదయం 7గంటలకు జరిగిన ఈ సంఘటనను గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై లారీని నిలిపివేసి స్థానికుల సహాయంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో హుటాహుటిన ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఒక్కసారిగా లారీ ఇంజిన్ లో నుంచి పెద్ద ఎత్తున దట్టమైన పొగ వ్యాపించడంతో స్థానికులు, వాహనచోదకులు భయభ్రాంతులకు గురయ్యారు.

గుర్తు తెలియని మృతదేహం



తాడేపల్లి గూడెం సమీపంలో రైల్వేట్రాక్ పక్కన మృతదేహం

బొబ్బిలి: తాడేపల్లి గూడెం పరిధిలో ట్రైన్ ఢీకొని ఓ గుర్తు తెలియిన వ్యక్తి మృతి చెందాడు. సోమవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మృతి చెందిన వ్యక్తి వద్ద నూజివీడు నుంచి బొబ్బిలికి కొనుగోలు చేసిన టికెట్ లభ్యం కావడంతో అక్కడి పోలీసులు బొబ్బిలి జీఆర్‌పీ సిబ్బందికి సమాచారం అందజేశారు. ఫొటోలను పంపించి ఆచూకీ కనుగొనాలని కోరడంతో స్థానిక జీఆర్‌పీ సిబ్బంది విలేకరులకు తెలియజేశారు. బొబ్బిలి లేదా పరిసర గ్రామాలకు చెందిన వ్యక్తి అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ఎవరైనా మృతుడిని గుర్తిస్తే బొబ్బిలి రైల్వే పోలీసులను సంప్రదిస్తే ఆ సమాచారి తాడేపల్లి గూడెం పంపించేందుకు అవకాశముంటుందని స్థానిక జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

బెట్టింగ్ మాయలో పడి..!

- తప్పుదారి పడుతున్న యువత
- బెట్టింగ్ మనీ కోసం అప్పులు, దొంగతనాలు
- ఆర్థికంగా దివాలా తీస్తున్న కుటుంబాలు

వీరఘట్టం: ఈ సీజన్ ఐపీఎల్ బెట్టింగ్‌లో ఘోరంగా డబ్బులు పోగొట్టుకున్న వీరఘట్టానికి చెందిన ఓ కుర్రాడు తాను పనిచేస్తున్న ఇంట్లో సుమారు 5 తులాల బంగారు నగలు దొంగిలించాడు. అలాగే ఇంకొందరు యువకులు అధిక వడ్డీలకు అప్పులు కూడా చేస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇటువంటి ఉదంతాలు ఎన్నో కుటుంబాల్లో కలకలం రేపుతున్నాయి. బెట్టింగ్ ఉచ్చులో పడి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంకా మేల్కొకపోతే యువత భవిత సర్వనాశనం అవడం ఖాయమని మేధావులు అంటున్నారు. ప్రతి ఏటా జూద క్రీడలకు అలవాటుపడిన కొందరు అలవాటు మానుకోలేక సీజనల్ జూదానికి తెరలేపుతున్నారు. ఏడాదిలో 20 శాతం పేకాట, మిగిలిన 80 శాతం క్రికెట్ బెట్టింగ్‌లతో కాలం వెళ్లబుచ్చుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. యువతను బెట్టింగ్ రొంపిలోకి లాగుతున్నారు. తాజాగా రెండు నెలల క్రితం ప్రారంభమైన ఐపీఎల్ క్రికెట్ పోటీలను తిలకిస్తూ బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ ఏడాది జరుగుతున్న ఐపీఎల్ టోర్నమెంట్ మరికొద్ది రోజుల్లో ముగియనుంది. ఈ మ్యాచ్‌ల కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది.



ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో పందెం కాస్తున్న ఓ యువకుడు

అంతా ఆన్‌లైన్‌లోనే..

ప్రస్తుతం క్రికెట్ బెట్టింగ్ అంతా ఆన్‌లైన్‌లోనే దర్జాగా జరుగుతోంది. మీడియేటర్ల ద్వారా పందాలు కాస్తున్నారు. ప్రతి రోజూ వీరఘట్టంలో రూ.50 లక్షల వరకూ బెట్టింగ్‌లు విచ్చలవిడిగా బహిరంగ ప్రాంతాల్లో జరుగుతున్నట్లు సమాచారం. వీరఘట్టంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో ఉదయం 7 గంటల నుంచి 9గంటల వరకూ ఇవే చర్చలు. లక్నో టీమ్ నాదంటే, రాజస్థాన్ రాయల్స్ నాది అంటూ వెయ్యి రూపాయలకు రూ.16 వందలకు పందాలు కాస్తూ బెట్టింగ్ బంగార్రాజులు పేట్రేగి పోతున్నారు.చిన్న చిన్న కిరాణాషాపులు, పకోడీబడ్డీలు, పాన్‌షాపుల వద్ద ఈ తతంగం అంతా జరుగుతోంది. టెస్ట్‌మ్యాచ్‌లు, టీ20, వన్‌డే మ్యాచ్‌లు అని తేడా లేకుండా క్రికెట్ ఏ తరహాదైనా బెట్టింగ్ మాత్రం అదే తరహాలో కాస్తున్నారు. ఈ బెట్టింగ్‌లకు అలవాటుపడిన యువత పక్కదోవ బడుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి కుదేలవుతున్నారు. మరికొంత మంది ఆర్థిక నేరాలకు, దొంగతనాలకు పాల్పడుతున్నారు. మాయదారి క్రికెట్ బెట్టింగ్‌లు వీరఘట్టంలో గడిచిన పదిహేనేళ్ల నుంచి యథేచ్ఛగా జరుగుతున్నా ఇంతవరకూ ఒక్క కేసు కూడా నమోదు కాలేదు.

పోలీసులేమంటున్నారంటే..

ఇదే విషయాన్ని ఎస్సై జి.కళాధర్ వద్ద సాక్షి ప్రస్తావించగా క్రికెట్ బెట్టింగ్‌లపై నిఘా వేసి బెట్టింగ్‌లకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. యువత ఎక్కువగా క్రికెట్ బెట్టింగ్ వేస్తున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల నడవడికపై దృష్టి సారించి వారిని మంచి మార్గంలో నడిపించేలా చొరవ చూపాలి.

అనర్హులకు కేటాయించిన ఇళ్ల రద్దు

- 11 వేల గృహప్రవేశాలకు సిద్ధం చేయండి
- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్

విజయనగరం అర్బన్: పేదలకు గృహనిర్మాణం కోసం ప్రభుత్వం అదనపు నగదు మంజూరు చేసిందని అయినప్పటికీ గృహ నిర్మాణాల కోసం ముందుకురాని లబ్ధిదారుల స్టేటస్‌ను వెరిఫై చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ ఆదేశించారు. లబ్ధిదారులకు సొంత గృహం ఉండడం వల్లనే గృహ నిర్మాణాలకు ముందుకు రావడం లేదని తెలుస్తోందని అటువంటి వారి జాబితాలను ఇంటింటికీ వెళ్ల వెరిఫై చేసి ఆధారాలతో సహా రెండు రోజుల్లో ఇవ్వాలని వారికి మంజూరైన గృహాలను రద్దు చేయనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన కింద మంజూరైన 11 వేల గృహాలను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. 11 వేల ఇళ్లకు గాను ఇప్పటి వరకు 41 శాతం మాత్రమే పూర్తయ్యాయని ఇంకనూ 6,924 గృహాలు పూర్తి కావలసి ఉందన్నారు. బొబ్బిలి, విజయనగరం అర్బన్‌లో తక్కువ గృహాలు పూర్తి కావడంపై వివరణ అడిగారు. నీటి సరఫరా లేదని, వేసిన బోర్లు దొంగతనానికి గురయ్యాయని మున్సిపల్ కమిషనర్లకు లేఖ రాశామని పీడీ మురళి తెలిపారు. రెండు రోజుల్లో బోర్లన్నీ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల స్థలాల కోసం గతంలో ఇచ్చిన 4,096 దరఖాస్తులను వెరిఫై చేయాలని అలాగే మాన్యువల్‌గా వచ్చిన మరో 2,500 దరఖాస్తులను కొందరు తహసీల్దార్లతో సమన్వయం చేసుకుని అర్హతను వెరిఫై చేయాలని స్పష్టం చేశారు. అందరికీ గృహాలు, పీఎంజన్ మన్‌పథకాల కింద మంజూరైన జాబితాలను కూడా వెరిఫై చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ మురళీ మోహన్, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

బంగారం పుస్తెలతాడు చోరీ

సీతానగరం: మండలంలోని రామవరం పంచాయతీ రెడ్డివానివలసలో సోమవారం రాత్రి గాఢమైన నిద్రలో ఉన్న మహిళ మంచం దిండు కింద భద్రపరిచిన బంగారం పుస్తెలతాడు చోరీకి గురైంది. ఈ మేరకు పోలీసులు మంగళవారం తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రెడ్డి ప్రియాంక కన్నవారింట్లో (రెడ్డివానివలసలో) తండ్రితో పాటు పిల్ల లతో సోమవారం రాత్రి పడుకుంది. వారంతా గాఢమైన నిద్రలో ఉండగా గుర్తు తెలియవ్యక్తి ఇంట్లోకి చొ రబడి వరండాలో పట్టిమంచంపై పడుకున్న ఆమె తలకింద భద్రపరుచుకున్న సుమారు రెండు తులాల బంగారు పుస్తెలతాడు పట్టుకు ని వెళ్లిపోయాడు. దీనిపై కుటుంబసభ్యులు ఇ చ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్, సీసీఎస్ పోలీసులు పరిశీలించారని చెప్పారు.

వెబ్‌సైట్‌లో ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుల జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టుల భర్తీకి సంబంధించి ఐదుకేటగిరీలకు చెందిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, పీఈటీ, ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్ గ్రేడ్-3 పోస్టులకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను వెబ్‌సైట్‌లో పెట్టారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 28 నుంచి 31 వతేదీ వరకు, 2 వతేదీ నుంచి నాలుగో తేదీ వరకు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటలులోగా తెలియజేయాలని సూచించారు.

పైడితల్లమ్మవారికి జెడ్పీ ఛైర్మన్ ప్రత్యేక పూజలు

- పైడితల్లమ్మకు జెడ్పీ ఛైర్మన్ ప్రత్యేక పూజలు

విజయనగరం: కార్పొరేషన్ పరిధిలోని ధర్మపురి గ్రామంలో వెలసిన పైడితల్లమ్మవారికి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు కుటుంబసమేతంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చల్లదనోత్సవంలో భాగంగా సతీమణి ఆయన పుష్పాంజలి, కుమార్తె సిరిసహస్ర, అల్లుడు ప్రదీప్ నాయుడులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ చల్లనితల్లి పైడితల్లమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ధర్మపురిలో వెలసిన పైడితల్లమ్మవారి ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



పైడితల్లమ్మవారికి కుటుంబసమేతంగా పూజలు చేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

పైడిమాంబ చిత్రం రెండో షెడ్యూల్‌కు రెడీ

విజయనగరం టౌన్: శ్రీపైడిమాంబ ఆధ్యాత్మిక కళానికేతన్, జ్ఞానభేరి సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణమవుతున్న జై పైడిమాంబ చిత్రం రెండో షెడ్యూల్‌కు సిద్ధమవుతున్నట్లు కళానికేతన్ వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో మంగళవారం చిత్రయూనిట్, స్థానిక పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలిషెడ్యూల్‌లో చిత్రం బాగా వచ్చిందన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్రపటాలను, ప్రసాదాలను చిత్ర యూనిట్‌కు అందజేశారు. కార్యక్రమంలో నటులు రవితేజ, డాక్టర్ మురళీధర్, పెద్దింటి అప్పారావు, డాక్టర్ జక్కు రామకృష్ణ, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాకు రండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామస్థాయిలో కార్యక్రమాలను చేపడుతున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక మంగళవారం సాయంత్రం జిల్లా, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఇప్పటివరకు 216 మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ జరిగిందని, 3550 శిక్షకులు ఇప్పటి వరకూ నమోదు చేసుకుని శిక్షణ పొందుతున్నారని తెలిపారు. శిక్షకులను గ్రామస్థాయిలో మ్యాపింగ్ చేయాలని సూచించారు. జిల్లాలో 48 వేల మంది ప్రజలు నమోదయ్యారని చెప్పారు. జూన్ 21 నాటికి ప్రతి ఒక్కరూ యోగాపై అవగాహన కలిగి, సాధన చేసే విధంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్యూ ఆర్ కోడ్ వినియోగించి త్వరితగతిన నమోదు కావచ్చని సూచించారు. జిల్లాలో పెద్ద ఎత్తున నమోదు చేసుకుని ఆదర్శంగా నిలవాలని కోరారు. ప్రతి గ్రామంలో యోగా పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో యోగా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచే సత్తా ఉన్న వారు అనేక మంది ఉన్నారని, అందరూ పోటీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కరరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్ల కొండలరావు, జిల్లా ఉద్యాన అధికారి బి.శ్యామల, జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా.టి.కనకదుర్గ, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణవేణి, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బీసీ సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

వంగర: మండల పరిధిలోని అరసాడ శ్రీసంతోషిమాత ఆలయం ఆవరణలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. మంగళవారం ఎదురెదురుగా వెళ్తున్న ఆ ఇద్దరు వ్యక్తుల బైక్‌లు ఢీకొనడంతో బూరాడకు చెందిన శంకరరావుకు తలకు గాయాలు కాగా, పోరాంకు చెందిన కుడి కాలికి గాయాలయ్యాయి. 108కు స్థానికులు సమాచారం అందించడంతో ఈఎంటీ విశ్వనాథ్, పైలట్ సాయిబాబా క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై దర్యాప్తు చేసి కేసు నమోదు చేయాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

నకిలీ పట్టాలతో మోసగించిన మహిళ

- పట్టాలిప్పిస్తానని పలువురి వద్ద వసూళ్లు
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసునమోదు, రిమాండ్‌కు తరలింపు

పార్వతీపురం రూరల్: సొంతింటి కల నెరవేర్చుకుందామనే వారి ఆశను పెట్టుబడిగా నకిలీ పట్టాలతో ఓ మహిళ మోసగించి భారీగా వసూలు చేసిన ఘటన పార్వతీపురం జిల్లా కేంద్రంలో జరిగింది. కష్టపడి కొంతమొత్తాన్ని కూడబెట్టి, ఇంకొంత అప్పులు చేసి సొంతింటి కల నెరవేరుతుందన్న ఆశతో ఉన్నవారిని పసిగట్టి నమ్మకం కలిగించి అధికారంలో ఉన్న నాయకుడికి తాను ఎంత చెబితే అంత అని బాధితులను నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసి..టిడ్కో గృహ సముదాయాల్లో ఇంటిని ఇప్పిస్తానని నమ్మబలికింది. ఈ ప్రక్రియలో భాగంగా నకిలీ స్టాంపులను తయారు చేసి నకిలీ పట్టాలను ఏడుగురు బాధితులకు పంపిణీ చేసింది. అయితే ఆ పట్టాలు నకిలీవని తేలి..ఎప్పటికీ టిడ్కోలో గృహాల కేటాయింపు కాకపోవడంతో తాము మోసపోయామని గమనించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన కల్లూరు సురేష్ ఈనెల 11న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రాథమిక దర్యాప్తు నిర్వహించిన అనంతరం మంగళవారం పార్వతీపురం పట్టణానికి చెందిన పద్మాంబికతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీష్ నాయుడు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు నిందితురాలు పద్మాంబికను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నిందితురాలు పద్మాంబిక అధికార టీడీపీకి చెందిన ప్రముఖ నాయకుల కనుసన్నల్లోనే ఈ వ్యవహారమంతా నడిపి ఉంటుందని స్థానికులు, బాధితులు చర్చించుకుంటున్నారు.

ప్రతి గ్రామం నుంచి 7 బృందాలు రావాలి

పూసపాటిరేగ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపల్లిలో జూన్ 6న జరిగే యోగా కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి 7 బృందాలు(ఒక్కో బృందంలో 50 మంది) హాజరయ్యేలా చూడాలని ఎంపీడీవో ఎం.రాధిక ఆదేశించారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్ త్వరగా మొదలు పెట్టాలి

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: ప్రకృతి అనుకూలత వల్ల ఈఏడాది ముందుగానే వర్షాలు మొదలయ్యాయని వీలైనంత వేగంగా విత్తనాలు జల్లి ఖరీఫ్ సీజన్ మొదలుపెట్టాలని కలెక్ట్ బీఆర్ అంబేడ్కర్ అధికారులకు సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన వ్యవసాయ అధికారులు తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అక్టోబర్ లోగా కోతలు పూర్తి చేసేవిధంగా వీలైనంత త్వరగా విత్తనాలు జల్లాలని సూచించారు. దీనివల్ల నవంబర్‌లో వచ్చే తుఫాన్ల ముప్పు నుంచి తప్పించుకోవచ్చని అభిప్రాయ పడ్డారు. తద్వారా రబీసీజన్ కూడా వీలైనంత త్వరగా మొదలు పెట్టే అవకాశం కలుగుతుందన్నారు.

కౌలు రైతులకు రుణాలు

జిల్లాలో ఈఏడాది సుమారు 16,500 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీచేసి, వారికి రూ.150 కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జూన్ మొదటి వారంలోగా ఈ గుర్తింపు కార్డుల పంపిణీ పూర్తి చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ కోసం సుమారు 4,89,116 మంది రైతుల వివరాలను తనిఖీ చేసి అర్హుల జాబితా ఎంపిక ప్రక్రియను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మండల వ్యవసాయ అధికారుల లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న రోజుల్లోనే తనిఖీ పూర్తి చేసి అమోదం తెలపాలని స్పష్టం చేశారు. రైతుల ఆధార్ కార్డుల సవరణ, మార్పులు, చేర్పులపై దృష్టి పెట్టాలని సూచించారు. పీజీఆర్‌ఎస్‌లో రెవెన్యూకు సంబంధించి 1017 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వారం రోజుల్లో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో జేసీ సేతు మాధవన్, డీఆర్ఓ మురళి, జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, ఎల్‌డీఎం నారాయణమూర్తి, ఏపీ సీడ్స్ డీఎం పద్మ, మార్క్‌ఫెడ్ డీఎం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో లోపాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లండి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీని కోరిన పీఆర్‌టీయూ

మెరకముడిదాం: ఉపాధ్యాయుల బదిలీల్లో అసంబద్ధమైన విషయాలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడిని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తిరాంబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన విజయనగరంలో ఎమ్మెల్సీ గాదెను ఆయన ఇంటివద్ద కలిసి ఎస్జీటీ ఉపాధ్యాయులు బదిలీల్లో ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు. వాటిని వెంటనే కమిషనర్ స్థాయిలో పరిష్కరించాలని కోరారు. ఈ విషయంలో ఎస్జీటీలకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పీఆర్‌టీయూ నాయకులు కృష్ణమూర్తి, రామకృష్ణ ఉన్నారు.



ఎమ్మెల్సీ గాదెకు సమస్యలు వివరిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, తదితరులు

ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న గ్రామాల గుర్తింపు

- డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని రాజాం, సంతకవిటి, వంగర, ఆర్. ఆముదాలవలస మండలాల్లోని 25 గ్రామాల్లో సర్వే చేసి నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న గ్రామాలను గుర్తించినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. జీవనరాణి తెలిపారు. ఈ గ్రామాల్లో నివసిస్తున్న జనాభాలో 30 మంది పిల్లలను, 58 పెద్ద వారిని ఫ్లోరైడ్ అనుమానిత బాధితులుగా గుర్తించామన్నారు. వారిలో ముగ్గురుపిల్లలు, ఆరుగురు పెద్ద వారికి డెంటల్ ఫ్లోరోసిస్ ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఇద్దరు పెద్ద వారికి ఫ్లోరోసిస్ ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి కాల్షియం మల్టీ విటమన్ టాబ్లెట్లు అందించామని తెలిపారు. నడవలేని వారికి వీల్‌చైర్స్, టాయిలెట్ కమోడ్స్ ఇచ్చామన్నారు. ఆ గ్రామాలకు వెళ్లి ఫ్లోరైడ్ ఎక్కువగా ఉండడానికి కారణాలపై, ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోవాలి? ఎలాంటి ఆహార పదార్థాలు తీసుకోకూడదనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండే పదార్థాలైన బ్లాక్ సాల్ట్ వాడే పానీపూరీ, కురుకురే, చాట్, మురీమిక్చర్ వంటివన్నారు. కాల్షియం అధికంగా ఉంటే ఆకుకూరలు, నువ్వులు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

అవగాహన విజయవంతం చేయాలి



పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజీయూఏ) అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జూన్ 15 నుంచి 30 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ ధర్తీ ఆబాజన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలను త్రికరణ శుద్ధితో అమలు చేసేందుకు కృషి చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా గిరిజన ప్రాంతాలలో సేవలు, మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామ స్థాయి/క్లస్టర్ స్థాయి శిబిరాల ద్వారా వివిధ సౌకర్యాలను క్షేత్ర స్థాయిలో అందించేందుకు ఉద్దేశించినట్లు తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఆయుష్మాన్ భారత్ కార్డ్, కుల ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలు, కిసాన్ క్రెడిట్ కార్డ్ పీఎం కిసాన్ కార్డులు, జన్ ధన్ ఖాతా, పీఎం జేజీబీవై, పీఎంఎస్ బీవై బీమా కవరేజ్, వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ సామాజిక భద్రత పింఛన్లు, ఉపాధి హామీ, పీఎం విశ్వకర్మ, ముద్ర తదితర జీవనోపాధి పథకాలు, పీఎం ఎంఈవై, ఇమ్యునైజేషన్ తదితర స్త్రీ శిశు సంక్షేమ ప్రయోజనాలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

పోషకాహార ప్రదర్శనల ఏర్పాటు

గ్రామస్థాయిలో ఆధార్‌లో నమోదు కానివారిని అంగన్వాడీ సిబ్బంది నమోదు చేయించాలని ఆదేశించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాల పోషక విలువలు తెలియజేసేందుకు ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సూచించారు. పాడైన గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోను అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేయరాదని ఆదేశించారు. రక్తహీనత లేకుండా దృష్టి సారించాలని, ప్రసవ తేదీలను ముందుగానే గుర్తించి ఆస్పత్రిలో చేర్పించాలని చెప్పారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగరాదని ఆయన స్పష్టం చేశారు. పుట్టిన బిడ్డకు పాలు పట్టే విధానం తెలియక పోవడం వల్ల కూడా కొన్ని శిశు మరణాలు జరుగుతున్నాయని, పాలు పట్టే విధానం పట్ల అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. గిరి చైతన్యం డిజిటల్ మీడియా వాహనం ద్వారా కూడా పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

బడుగులపై పిడుగు



పిడుగుపాటు బలైన కాడెద్దు



సన్నిబాబు (ఫైల్)

లక్కవరపుకోట/బొబ్బిలిరూరల్: వాతావరణ ప్రభావంతో కురుస్తున్న వర్షాల సందర్భంగా పడుతున్న పిడుగులు బడుగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మంగళవారం జిల్లాలో పడిన పిడుగులకు లక్కవరపుకోట మండలంలోని చందులూరు గ్రామం శివారు కళిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కళిరెడ్డి సన్నిబాబు(60) మృత్యువాత పడ్డాడు. సన్నిబాబు తన పాడిగేదెలను గ్రామం సమీపంలో గల పొలంలో మేపుతుండగా ఒక్కసారిగా మెరుపులు పెద్దపెద్ద ఉరుములతో భారీ వర్షం కురిసింది. దీంతో సమీపంలో పిడుగుపడడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అలాగే బొబ్బిలి మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ పరిధి రాజుపేట గ్రామంలో పిడుగుపాటుకు గురై రెండు కాడెద్దు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన రైతు కోరెడ్ల బంగారునాయుడు తన ఎడ్లతో ఏరు పూసి మంగళవారం సాయంత్రం పొలం దున్నేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో అకస్మాత్తుగా కమ్ముకున్న మేఘాలు, ఉరుములతో పిడుగుపడింది. దీంతో బంగారునాయుడు ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించు కోగా రెండు కాడెద్దు అక్కడికక్కడే మృతిచెందాయి. ఈ సంఘటనతో రైతు లబోదిబోమన్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చూడాలని అధికారులను కోరాడు.